కవితా కౌముది

# పూజగది

రవిప్రసాద్ చెలమల్లు

అగరువత్తి
ఊరికే కాలి బూడిద అవ్వదు
ధూపంగా మారి ఊరేగినంత మేర
పరిమళాలు పంచుకుంటూ పోతుంది
దీపం
సరదాగా వెలిగి నుసిగా మారదు
వెలుగుతూ ఉన్నంత సేపు
చుట్టూ కమ్ముకున్న చీకటిని తరిమేస్తుంది
జేగంట
ఆషామాషిగా అటూ ఇటూ ఊగదు
గణగణమంటూ ఉన్నంత వరకూ
చుట్టూ పేరుకున్న స్తబ్దతను పెకలిస్తుంది
కర్పూరం
గుప్పున వెలిగి చప్పున కనుమరుగవదు
తను కాలిపోతూ, చుట్టూ పేరుకున్న చెడు వాసనలన్నీ
చిటికెలో మటుమాయం చేస్తుంది

అదేమిటో కానీ...పూజగది నిండా
ఆయువు కంటే ఆశయం, స్వార్థం కంటే పరోపకారం
ప్రధానమని బతుకు పాఠాలు నేర్పే ఎన్నెన్నో ఉపకరణాలు
ఎవరైనా... నేర్చుకుంటే బావుణ్ణు! ఈ జీవన వేదాల్ని...

★★★

## భాషను నిషేధించిన మనసు

**శ్రీసాహితి**

రోజా తగిలిన చోటే
మళ్ళీ గాయం.

శరీరంలో రక్తం
మనసులో ప్రేమ
కలసి చేసే రాత్రి ప్రయాణంలో
కన్నీటి కట్ట తెగి
ఏకాంతంలో ప్రవహిస్తున్నది.

ఒంటరిలో ఇంకిన మాట
మనసును చీల్చుకుని వచ్చి
మనిషిని ఆ మనిషికే
దూరం చేస్తున్నది

చివరకు
భాషను నిషేధించిన మనసు
మౌనాన్ని ముఖానికి చుట్టి
మనిషిని దాచింది.

★★★

## నిజమైనది

**పావని సుధాకర్**

రాత్రి చిక్కటి నలుపు నీలపు మబ్బు
తెరలలో స్పానిష్ డాన్సర్ లా
ఆకాశ విశాలాల అంచుల్ని స్పర్శిస్తో
శాంతి విశ్రాంతిని అవని పై వర్షిస్తోన్న వేళ

కనురెప్పల అంచుల మీద నిద్ర అల
అల్లుకుంటోన్న కలల వల!
కదిలిన నీడో, జారిన జాడో- నిన్నో , నేడో, రేపో,
అన్నీ కలిసిన అంతు పట్టని అద్భుతవో

కాలం లేని ప్రపంచం లో
వునికి లేని మనుష్యులు
పోయినా, వుంటూ, వున్నా పోతూ..
మాయా నాటకం లో మరో చిన్న రంగుల రంగం

నిజం కానిది కల లోని ఘటన
నిజమైనది కలే
మరి కల కానిది ?
బ్రతుకే!

★★★

# నివేదన

అనూరాధ బండి

ఎన్నో ఉదయాలు వచ్చివెళ్ళాయి.
నువ్వెప్పుడూ వచ్చివెళ్ళనేలేదు.
నేనిక్కడ కాలపు గడపపై కూర్చుని
నీ ఆగమనం గురించిన కలలో
నిరీక్షిస్తూనే ఉన్నాను.

కొన్నిసార్లు పక్షులను నువ్వుకులా వింటాను.
మరికొన్నిసార్లు తుమ్మెదల కలవరాన్ని
పరికిస్తాను.
నువ్వన్న ఉనికితో, ఒక పూలవనమే
ఉన్నది; ఇక్కడ, లోలోన.
వికసించీ వాడీ, ఎంత కలత హృదయాన్నో!

కనురెప్పలచప్పుడులో పుడుతున్న
సీతాకోకచిలుకలన్నీ ఏమయ్యాయో!?
రంగులుగా నిను చుడుతున్నాయో లేదో!

నువ్వు కానరాక కంటున్న నిట్టూర్పులు
కొత్తరాగాన్ని అందుకున్నాయి.
వినిపించుకునే దూరంలో నువు నిలిచివున్నావో
లేదో!

ఎన్నిసార్లు ఈ చెట్లు ఆకులనురాల్చినవో!
మరెన్నిసార్లు నాలో ఆశలా చిగురించినవో!
ఎంతోమంది బాటసారులు, ఈరహదారివెంట..
ఒక్క అడుగూ నీదిపడని ఈ ముంగిట,
నేనో రంగవల్లినై నిరీక్షిస్తునే ఉన్నా...

కంటిచూపు మందగించుతోన్నది.
శరీరం కాస్త కాస్త శుష్కిస్తోన్నది.
శిరోజాల రంగు మారుతోంది.
ఎన్నెన్నో పున్నములు, ఒక్కటీ
నిన్ను తెచ్చి ఇవ్వనేలేదు.
ఇక ఋతువుల సంగతి సరేసరి.

ఇప్పుడూ, ఈ మెలకువలోనూ
ఇక నువ్వే ఉదయమని అనుకుని
ఈరోజుని కూడా భద్రపరచాలనుకుంటున్నాను.
నువ్వెప్పుడైనా రాత్రి ఆకాశమైవచ్చినప్పుడు
ఈ క్షణాలన్నీ నీలోని నక్షత్రాల్లా మెరవకపోవు.

దిగులంతా గుప్పిటపట్టి ఉంచుతానా; చూస్తే
ఆకాశం మబ్బుపట్టిఉంటది.
నిదానంగా చినుకులు మొదలై
గుప్పిట వదులై
మరి నేనూ నీలోకి జారిపోతానా, అప్పుడూ!

★★★

# రసరేఖలు శ్రీధర్ బచ్చోటి

పరిచితము గాని క్రొంగొత్త ప్రాంతమిద్ది
నడచుచుంటిని కాంచుచు నవ్యసీమ
అరయ పరదేశముద్వేగమందె మనసు
తనిసి మరలితినంత నా యునికి వైపు

తెలియనేరను దారుల తీరుతెన్ను
లన్ని మార్గముల్ క్రొత్తవే యనుచు తోచు
ఏ దిశను నెలవున్నదో యెరుగలేను
తూర్పు పడమరలేవియో తోచదయ్యె

ఏల మరచితి జీవితధ్యేయములను?
ఏల ప్రక్క మార్గముల పోయితిని నేను?
గమ్యమన్నది కంటికి కానదయ్యె
పూర్వగమ్యము గతమయ్యె బుద్ధినుండి

కారుచీకట్ల త్రోవను కాంచుటెట్లు?
జటిల మార్గాన పయనమ్ము సాగుటెట్లు?
ఎవరు చిరుదివ్వెనొకటి వెల్గింపగలరు?
ఎవరు కేల్పట్టి నను నడిపించగలరు?

అన్యమార్గము గొనుట సత్యమ్మె యైన
దిద్దుకొనలేని తప్పిదమద్ది కాదు
అన్ని వైపుల చీకటి యలముకొనిన
మానసోద్భూతదీప్తియే మార్గదాయి

COMMENTS